# ఎర్ర గులాబీలు

ఒక రోజు పొద్దున్న నేను హాల్లో కూచుని పేపరు చూస్తున్నాను.గేటు తెరచిన చప్పుడైంది.వరండాలోకి వచ్చాను. ఒక వ్యక్తి సన్నగా, ఎర్రగా, పొడుగ్గా వున్నాడు. గబగబా నడిచి వచ్చాడు నా వైపు. అతని వాలకం చూస్తే అతృత పడుతున్నట్లున్నది.నేను యెవరి కోసం అని అడిగే లోపునే అతడు మాట్లాడాడు.

"మీ బాల్కనీ మీద పూసే ఎర్ర గులాబీలు రెండు కావాలండి. మా చెల్లెలికి పదిహేను రోజులుగా జ్వరం వస్తోంది.మొన్నటి నుంచి ఎర్ర గులాబీ పూలకోసం కలవరిస్తోంది. ఎక్కడో ఎప్పుడో చూసిందట.కావాలని కూర్చుంది. బజారంతా తిరిగాను. ఎక్కడా దొరకలేదు. మీరు రెండు పూలిస్తే..." దీనంగా చూశాడు.

నాకు మనస్సు వప్పటం లేదు. ఆ పూలు కేసి యివ్వటానికి. నాన్నగారు బెంగుళూరు నుంచి తెప్పించిన అంట్లు అవి. మూడు మొక్కలూ ఈ ఏడాదే పూస్తున్నాయి. ఎంతో అందంగా వున్నాయి. ఆ పూలు నేనయినా ఎప్పుడే గాని కొయ్యను. అలాంటిది ఈ అపరిచిత వ్యక్తికి యివ్వాలంటే మనస్సువప్పటం లేదు. నేను సందేహించటం గ్రహించాడతను.

"పూలు లేకుండా యింటికి వెళ్ళడం అంటే భయం వేస్తోందండీ. 'అన్నయ్యా తెచ్చావా?' అంటుంది. మనస్సు చివుక్కుమంటుంది. ఏ పార్కులోనూ నాకు తెలిసిన వాళ్ళు లేరు. పోనీ ఒక్క పువ్వన్నా...?" చెల్లెలి పంచ ప్రాణాలు ఆ పూల మీద పెట్టుకుందన్నట్టుగా మాట్లాడుతున్నాడతను. నా ఆలోచనేమిటి? గబగబ మేడ మీదకు వెళ్ళాను. బాల్కనీ మీద పూలు గాలికి అందంగా ఊగుతున్నాయి. పెద్ద పువ్వు ఒకటి కోసుకొచ్చి అతనికిచ్చాను. నాలో యెక్కడనుంచో ఔదార్యం పుట్టుకొచ్చింది. "మీ చెల్లెలు జ్వరం తగ్గే వరకు రోజూ ఒక పువ్వు కోసి యిస్తానులెండి" అన్నాను. అతను చిరునవ్వుతో పువ్వు తీసుకుని వెళ్ళిపోయాడు.

నాలుగు రోజులు వరసగా వచ్చాడతను. పూలు తీసుకెళ్ళాడు. వాళ్ల చెల్లెలు యెంత ఆనందం చూపుతున్నదో చెప్పాడు. ఆ పువ్వుని చేతిలో పెట్టుకునే నిద్రపోతుందిట.

ఒక ఉదయం అతను రాలేదు. నేను హాల్లోనే కూర్చుని ఉన్నాను. గడియారం ఎనిమిది కొట్టింది. కానీ అతను రాలేదు. ఒక మాటు వరండాలోకి వెళ్ళి చూశాను. నాకు సిగ్గేసింది. ఎందుకు నాకీ ఆదుర్దా అని. కాని కాస్సేపాగి పైకి వెళ్ళి బాల్కనీ మీదనుంచి చూశాను. అతని జాడ లేదు. ఏమయ్యాడతను? ఆ చెల్లెలు ఎలాగుందో?

నాకు చట్టుక్కున ఓ ఆలోచన తోచింది. ఇతనికి నిజంగా చెల్లెలుందా? ఇతను చెప్పిందంతా నిజమేనా? కాకపోవచ్చు. జ్వరం వస్తే పిల్లలు పూల కోసం కలవరిస్తారా? కలవరించినా పెద్దవాళ్ళు మరిపిస్తారు కాని యిలా ఊళ్ళో అందరి ఇళ్ళకూ పోయి పూలు తీసుకొస్తారా? అంతా అబద్ధంగా, అసంబద్ధంగా తోచింది నాకు. మరెందుకు వస్తున్నట్టు అతను? అసలు పూలకోసమేనా? అంతగా పూలు కావలసి వస్తే కొనుక్కోలేదూ? తనే ఎందుకు వస్తాడు రోజూ? ఎవరినైనా పంపడూ? ఈ కాలం కుర్రాళ్ళు అసాధ్యులు. నవలలు, కథలు చదివి ఆడపిల్లలతో పరిచయాలు కలిగించుకోవడానికి కొత్తకొత్త మార్గాలు కనిపెడుతున్నాడు. ఇదొక రకం కావచ్చు. రేపు రాగానే, చెప్పేస్తాను. 'పూలు యివ్వడానికి వల్లకాదని' హాల్లోకి వచ్చి మళ్ళీ పేపరు చూడడం మొదలెట్టాను. అతని ముఖం జ్ఞాపకం వచ్చింది. వాడిపోని చిరునవ్వు, ఆ కళ్ళు – తమాషాగా వాలుస్తాడు రెప్పల్ని. చాలా నీటుగా వున్నాడు మనిషి మాత్రం. ఐనా కెందుకు అతన్ని గురించిన ఆలోచన.

మర్నాడు వచ్చాడతను. అతను వచ్చేవరకూ తహ తహలాడానేమో అనిపించింది. ఏమిటి నాలో మార్పు? పొద్దున్నే లేచినప్పటి నుంచి అతని రాకకోసమే చూస్తున్నానా నేను? అతనికా పూలు యివ్వడం, అతని చిరునవ్వులు అందుకోవడం యిదంతా అలవాటయిపోతోందా? లేకపోతే నాకెందుకీ తహతహ! పొద్దున్నే స్నానం చేసి కొత్త గులాబీ చీర కుట్టుకున్నాను. ఒకటికి రెండు సార్లు అద్దంలో చూచుకున్నాను. ఎర్రగులాబీ పూలు కోసి తల్లోపెట్టుకున్నాను.

అతను వచ్చాడు లోపలికి వచ్చి కూచోమని ఆహ్వానించాను. అతను చాలా సరదాగా మాట్లాడాడు. మధ్య మధ్య చాలా అందంగా నవ్వుతాడతను.

పది రోజులు గడిచాయి. నాలో మార్పు నాకవగాహన కావడం మొదలెట్టింది. నా అలంకరణలో శ్రద్ధ ఎక్కువ చూపుతున్నాను. పూలు కోయడం ఎంతో బాధ అనిపించేది నాకు. ఇప్పుడదో సరదా అయిపోయింది. అతని రాక తప్పని సరి సంఘటనైంది. అతను నా పరిచయం కోసమే వస్తున్నాడన్నమాట నేను ఖాయపరుచు కున్నాను. కాని అది తప్పేమో అన్న ఆలోచన రాలేదు నాకు. ఎప్పుడో ఒకప్పుడు చెప్పకపోతాడా అనుకున్నాను. అప్పుడే అతడ్ని మందలిద్దామని అనుకున్నాను. కానీ నే నతడ్ని ప్రోత్సాహం చెయ్యటం లేదూ?... ఏమో...!

హఠాత్తుగా అతను రావడం మానేశాడు. వరసగా వారం రోజులు రాలేదు. పొద్దునంతా కలతగా గడిచేది నాకు. ఏదో కొరతగా అనిపించేది. ఎందుకు రాలేదతను? నాన్నగారుగాని మరెవరైనా గాని మందలించలేదు కదా? ఎవరూ చూసే అవకాశం లేదా! పొద్దున్న పూట హాల్లో ఎవరూ వుండరు. అతనికేమైనా జబ్బు చేసిందేమో! నా గుండె దడదడ కొట్టుకుంది. అతనెక్కడుంటాడో, ఏం చేస్తాడో కూడా కనుక్కోలేదు. కానీ అతడు వస్తాడు. యెప్పుడో.. అతడు నిజంగా పూలకోసం వస్తేగా! నా ముఖాన చిరునవ్వు విరిసింది. గర్వపడ్డానేమో అనిపించింది.

మర్నాడు నా పేర కవరు వచ్చింది. అపరిచితమైన దస్తూరి. ఎవరిదో అనుకుంటూనే విప్పాను అతనే!!

కుమారిగారికి...

నేను హఠాత్తుగా కనిపించకపోవడం మీకు ఆశ్చర్యం కలిగించి వుండవచ్చు. మీకు నేను క్షమాపణ చెప్పుకోవాల్సిన అవసరం యెంతైనా ఉంది. మీకు చెప్పినట్లుగా నాకు చెల్లెలు లేదు. మా యింట్లోజ్వరం ఎవరికీ రాలేదు. ఎర్ర గులాబీలకోసం కలవరించిన మాట కూడా అబద్ధమే. మరెందుకొచ్చానంటారేమో! ఇక్కడే నేను మీకు క్షమాపణ చెప్పుకోవాలి..." నా మనసు ఆనందంతో నిండుతోంది. అసలు సంగతి చెబుతున్నాడు. ఆదుర్దాగా గబగబా చదవసాగాను.

"నేను ఒక సంవత్సరంగా పిచ్చివాడినై తిరుగుతున్నాను, ఒక పిల్ల మీద ప్రేమతో. ఆ చంచలాక్షి క్రిందటి నెలలోనే నన్ను కటాక్షించింది. మాటల సందర్భంలో తనకి ఎర్ర గులాబీ పూలంటే చాలా ఇష్టమని చెప్పింది. అవి సంపాదించి ఇచ్చి ఆమె వదనం మీద చిరునవ్వు చూడామని కోరిక కలగటం సహజం. ఎక్కడ దొరుకుతాయి,ఈ అపురూప పుష్పాలు. రోజూ సైకిలు మీద ఇలా పోతూ మీ బాల్కనీ వైపు చూసేవాడిని. ఈ పూలు నన్ను ఆకర్షించాయి. ఒకటి రెండు సార్లు మిమ్మల్ని కూడా చూశాను మేడ మీద. ఎలాగైనా పూలు సంపాదించాలని కథ అల్లాను. మీలాంటి వారి హృదయం తేలిగ్గా కరిగించవచ్చని ఆశించాను. మీరు నమ్మారు. పూలు ఇచ్చారు. నా దేవత చాలా చాలా ఆనందించిది. మా పెళ్ళి కూడా నిశ్చయమైంది. మీతో ఇవన్నీ ముఖత చెప్పే సాహసం లేకపోయింది. మీరు నన్ను క్షమించాలి. మీ బాల్కనీ మీద పూలంత అందమయిన పూలు నేనెక్కడా చూడలేదంటే అతిశయోక్తి కానేరదు. అంత చక్కని పూలు పూయిస్తున్నందుకు మిమ్మల్ని అభినందిస్తున్నాను. నన్ను క్షమించండి."

నాచేతిలోంచి పడిపోయింది ఉత్తరం. సోఫాలో కూలబడ్డాను. నిశ్చష్టితంగా గోడవంక చూడసాగాను. నా మనస్సులో ఒక మూలనుంచి ఏదో ఆవేదన, బాధ పొడసూపింది. గిలగిలలాడాను కాసేపు అర్థం కాని ఆవేదనతో. నేనెందుకని బాధపడుతున్నాను? అతనంటే నా మనసు "ప్రేమ" వంటి భావాన్ని పెంచుకుంటోందా? అప్పుడర్థం కాలేదు నాకు.

ఆ రాత్రి మేడ మీద గదిలో అద్దం ముందు నిల్చున్నాను. నా కళ్ళు మెరుస్తున్నాయి. కంఠం, బుగ్గలు, నుదురు అన్నీ కాంతితో శోభిస్తున్నాయి. నా చెక్కిళ్ళ మీద అరుణ కాంతులు నన్నే ముగ్ధపరిచేట్టుగా ఉన్నాయి. నేనందమైనదాన్నే. నేనెందుకు అంతగా బాధ పడ్డాను ప్రొద్దున్న?

అతనంటే యిష్టమా నాకు? ఏమో...! కాదు... నేను హతాశురాలిని ఐనాను. నాకు తెలియకుండానే అతడ్ని నేనాహ్వానించాను. నాలో నేను ఏదో మార్పులు కలిగించుకున్నాను. ఏదో జరుగుతుందనీ, అతను పిచ్చివాడల్లే నా వెంటపడ్డాడనీ వూహించుకున్నాను. ఒక ప్రణయం సాగుతుందనుకున్నాను. అదంతా జరగలేదు. అతను నాకోసం రాలేదు. ఆ విషయం నాకతను తెలియచేయక పోయినా బాగుండేది. ఇప్పుడు నా స్వాభిమానం దెబ్బతిన్నది.అందుకే ఏడ్చాను నేను. అందుకే!

ముందుకు వంగి అద్దంలో చూసుకున్నాను.

నేనందమైనదాన్నే. కానీ గిరుక్కున అద్దం మీద కర్టెను లాగేసి వెనక్కి తిరిగాను.